Office : 9440815774 మా ప్రతి అక్షరం – ప్రజల కోసం వ్యవస్థాపకులు : డి. విజయ్ కుమార్

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APETL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక




ప్రచురణ : చిత్తూరు, తిరుపతి సంపుటి : 02 సంచిక : 71 ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు శుక్రవారం 16 అక్టోబర్ 2026 పేజీలు : 4 వెల : 2

## ఢిల్లీలో సీజేపీ నిరసన.. అడ్డుకోలేమన్న హైకోర్టు



- ఎన్నికల అవకతవకల ఆరోపణలపై సీజేపీ నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతి
- కన్నాట్ ప్లేస్‌లో ఆందోళనను నిలువరించాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- సీజేపీ ఆందోళనలో పాల్గొననున్న ఆమ్ ఆద్మీ పార్టీ
- ఇండియా కూటమి సైతం ఇదే అంశంపై పోరాటం



## జగన్‌కు బిగ్‌షాక్

- అక్రమాస్తుల కేసులో రోజువారీ విచారణ షురూ
- జగన్ అక్రమాస్తుల కేసులో ఈడీ పిటిషన్లపై సీబీఐ కోర్టు రోజువారీ విచారణ
- అరబిందో, హెటిరో సంస్థల కేసులో జగన్ డిశ్చార్జ్ పిటిషన్‌పై కోర్టు విచారణ చేపట్టింది.
- ప్రధాన నిందితుడు జగన్ దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌పై ఆయన తరపు న్యాయవాది అశోక్ రెడ్డి వాదనలు

## ప్రతి గ్రామాన్ని ఉపాధి కేంద్రంగా మార్చడమే

# ధ్యేయం

- సంక్షేమం నుంచి స్వావలంబన దిశగా.. ఇదే మా విధానం: సీఎం చంద్రబాబు
- విజయవాడలో జాతీయ సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు
- గ్రామీణ మహిళల ఉత్పత్తుల కోసం 'స్వయం ఏపీ' బ్రాండ్ ఆవిష్కరణ
- మహిళలను సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు
- రాబోయే ఐదేళ్లలో మరో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తల తయారీకి ప్రణాళిక



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, సంపద సృష్టికర్తలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, గ్రామీణ మహిళల నైపుణ్యాలకు, ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో వేదిక కల్పిస్తున్న జాతీయ సరస్ మేళా–2026ను విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. దసరా శరన్నవరాత్రుల వేళ ఇంద్రకీలాద్రి సాక్షిగా ఈ మేళా నిర్వహించడం నగరానికి మరింత శోభను తెచ్చిందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి, ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత పదవిని అలంకరించిన - మిగతా3లో

## 'సర్' వివాదం.. 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో 'స్పెషల్ సమ్మరీ రివిజన్'

- తెలుగు రాష్ట్రాలకు త్వరలో ప్రకటన
- ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై తీవ్ర వివాదం
- 17 రాష్ట్రాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు ఈసీ ఆదేశం
- 2027 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎన్నికల సంఘం
- ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు తర్వాత షెడ్యూల్ ప్రకటన

# కూటమి పార్టీల సీట్ల సర్దుబాటు ఖరారు

- స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి జాబితా వచ్చేసింది
- మొత్తం 17 కార్పొరేషన్లలో 11 టీడీపీకి, 4 జనసేనకు, 2 బీజేపీకి కేటాయింపు
- 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలోనూ టీడీపీకి సింహభాగం
- విజయవాడ, కాకినాడ జనసేనకు.. రాజమండ్రి, అనంతపురం కార్పొరేషన్లు బీజేపీకి
- స్థానిక సమరానికి రెండేళ్ల ముందుగానే పక్కా ప్రణాళికతో సిద్ధమైన కూటమి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలో త్వరలో జరగనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి అధికార పక్ష కూటమి సమరశంఖం పూరించింది. సుదీర్ఘ చర్చలు, నియోజకవర్గాల వారీ సమీక్షల అనంతరం తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ల మధ్య మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల స్థానాల కేటాయింపు ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. క్షేత్రస్థాయి బలాబలాలు, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని మూడు పార్టీల అగ్రనేతలు స్థానాల పంపకంపై తుది నిర్ణయానికి వచ్చారు. మొత్తం స్థానాల్లో సింహభాగాన్ని తెలుగుదేశం పార్టీ దక్కించుకోగా, ఆ తర్వాత స్థానాల్లో జనసేన, బీజేపీలు పోటీ చేయనున్నాయి. తాజా ఒప్పందం - మిగతా3లో



## లక్ష్యం నెరవేరింది.. నక్సలిజం ముగిసింది

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- ఆయుధాలను త్యజించి జనజీవన ప్రవంతిలో కలిసిన వాళ్లు తమ జీవితాన్ని పునర్నిర్మించుకోవాలి
- ఒకప్పుడు తుపాకీ మోతలు, బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన బస్తర్ ప్రాంతంలో శాంతి పవనాలు వీచాయి
- దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించడం మాత్రమే సరిపోదు
- ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది

## దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు.. 12 కొత్త హాల్టులు

- దేశవ్యాప్తంగా 4 కొత్త రైలు సర్వీసులకు రైల్వే బోర్డు ఆమోదం
- ప్రయాణికుల సౌలభ్యం కోసం 3 రైళ్లను పొడిగించాలని నిర్ణయం
- మరో 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్ల ఏర్పాటు
- త్వరలో తేదీలను ప్రకటించనున్న సంబంధిత రైల్వే జోన్లు





## మున్సిపల్ పోరుకు వైసీపీ అభ్యర్థులు ఖరారు

- మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల పూర్తి జాబితా విడుదల
- మేయర్లు, ఛైర్మన్ల పూర్తి జాబితాను విడుదల చేసిన వైసీపీ అధిష్ఠానం
- వైఎస్ జగన్ ఆమోదంతో తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన
- జాబితాలో మహిళలు, బీసీ, ఎస్సీ వర్గాలకు గణనీయమైన ప్రాధాన్యం
- 7 కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు అభ్యర్థుల పేర్లు వెల్లడి

# మనం చేసి చూపిద్దాం

- ఏషియన్ గేమ్స్ హీరోలకు ప్రధాని మోదీ కొత్త నినాదం
- ఆసియా క్రీడల పతక విజేతలతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక భేటీ
- క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపిన ప్రధానమంత్రి
- భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్‌గా మారుస్తామని ఉద్ఘాటన
- క్రీడా మౌలిక వసతుల ఆధునీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం
- మహిళల హాకీ, క్రికెట్, కబడ్డీ జట్ల చారిత్రక విజయాలపై ప్రశంసలు



సౌత్ జోన్ బ్యాడ్మింటన్ టోర్నీలో

# ద్రావిడ వర్సిటీ మహిళల జట్టు

తొలిసారిగా అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో పాల్గొనే అవకాశం



**గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 15:** కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం మహిళల బ్యాడ్మింటన్ జట్టు తొలిసారిగా సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పాల్గొననుంది. ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు కర్ణాటకలోని హుబ్లీలో కేఎల్ఈ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య లక్కినేని చిన్న మల్లయ్య క్రీడాకారిణులను అభినందిస్తూ, చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పోటీల్లో ఆత్మవిశ్వాసంతో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. కిరణ్ కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వి. పలని క్రీడాకారిణులకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళల బ్యాడ్మింటన్ జట్టు తొలిసారిగా జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకోవడం విశ్వవిద్యాలయ క్రీడా విభాగానికి ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఎన్నికల బందోబస్తుపై పోలీసుల ప్రత్యేక దృష్టి

పలమనేరులో కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ ఎస్.షాను




**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 15:** రాబోయే మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పలమనేరులో పోలీసు శాఖ భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) ఎస్.షాను, పలమనేరు ఎస్‌డీపీఓ డేగల ప్రభాకర్‌తో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని డిస్పాచింగ్ కేంద్రం, పోలింగ్ స్టేషన్లు, నామినేషన్ కేంద్రాలను బుధవారం సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. కేంద్రాల్లో భద్రతా చర్యలు, పోలీసు బందోబస్తు, సిబ్బంది విధుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నామినేషన్ల దాఖలు సందర్భంగా అభ్యర్థులు, ప్రజలకు అసౌకర్యం కలగకుండా తగిన భద్రత కల్పించాలని, కేంద్రాల వద్ద క్రమశిక్షణ పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో పలమనేరు సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ రాజ శేఖర్ రెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో

# రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ తనిఖీలు

గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా




**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్15:** స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) ఆదేశాల మేరకు, తిరుపతి రూరల్ ఎక్సైజ్ సీఐ నరసనాయుడు సూచనలతో ఎక్సైజ్ అధికారులు రేణిగుంట రైల్వే స్టేషన్, పార్సిల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్సై కవీశ్వర్ నాయుడు సిబ్బందితో కలిసి గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గుర్తించలేదని అధికారులు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకు రైల్వే స్టేషన్, పార్సిల్ కార్యాలయాల్లో నిరంతర తనిఖీలు కొనసాగిస్తామని తిరుపతి రూరల్ ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. ఎన్నికల సమయంలో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ తనిఖీల్లో ఎస్సై కవీశ్వర్ నాయుడు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిజాయితీ చాటిన కుప్పం ఆర్టీసీ సిబ్బంది

మహిళా ప్రయాణికురాలు పోగొట్టుకున్న బ్యాగు సురక్షితంగా అప్పగింత

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్15:**




విధినిర్వహణలో బాధ్యతతో పాటు నిజాయితీని చాటుకున్న కుప్పం ఆర్టీసీ సిబ్బందిపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మహిళా ప్రయాణికురాలు పోగొట్టుకున్న బ్యాగును గుర్తించి, భద్రపరిచి తిరిగి ఆమెకు అప్పగించి సిబ్బంది ప్రశంసలు అందుకున్నారు. కుప్పం ఆర్టీసీ డిపో పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనలో డిపో ట్రాఫిక్ సూపర్‌వైజర్ రాజకుమారి, భద్రతా సిబ్బంది, అసోసియేషన్ నాయకులు, కండక్టర్ ఈశ్వరమ్మ, డ్రైవర్ లక్ష్మీపతి సమన్వ యంతో వ్యవహరించి బ్యాగును సురక్షితంగా బాధితురాలికి అందజేశారు. పోగొట్టుకున్న బ్యాగు తిరిగి లభించడంతో మహిళా ప్రయాణికురాలు ఆనందం వ్యక్తం చేస్తూ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రయాణికుల వస్తువుల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరిం చిన సిబ్బందిని డిపో యాజమాన్యం అభినందించింది. ప్రయాణికులకు మెరుగైన సేవలం దించడంతో పాటు, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో ఇలాంటి నిజాయితీ, సేవాభావం కీలకమని పేర్కొంది. ఆర్టీసీ సిబ్బంది చూపిన చొరవ ఇతరులకు స్ఫూర్తిదాయకమని పలు వురు ప్రశంసించారు.

# కలాం ఆశయాలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలి

**విద్యార్థులకు బీసీ నాగరాజ్ పిలుపు.. కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా అబ్దుల్ కలాం జయంతి**

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 15:** విద్యార్థులు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, కృషి, క్రమశిక్షణతో వాటిని సాధించాలని బీసీఎన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ బీసీ నాగరాజ్ పిలుపునిచ్చారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగం ఆధ్వర్యంలో గురువారం కలాం జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులను ఉద్దేశించి డాక్టర్ నాగరాజ్ మాట్లాడుతూ.. సాధారణ కుటుంబంలో జన్మించిన కలాం తన అసాధారణ ప్రతిభ, పట్టుదలతో దేశ అత్యున్నత పదవిని




అధిరోహించి యువతకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. శాస్త్రవేత్తగా దేశానికి విశేష సేవలందించడంతో పాటు, రాష్ట్రపతిగా సామాన్య ప్రజలకు చేరువై 'ప్రజల రాష్ట్రపతి'గా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, విద్యార్థుల అభ్యున్నతి, దేశాభివృద్ధి కోసం కలాం నిరంతరం కృషి చేశారని తెలిపారు. విద్యార్థులు ఆయన నిరాడంబరత, దేశభక్తి, క్రమశిక్షణ, దూరదృష్టిని అలవర్చుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. భాస్కరన్, పరిశోధన-అభివృద్ధి విభాగం డైరెక్టర్ డాక్టర్ కోదండరామయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గంగాధరన్, కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ్ కుమార్, ప్రజాసంబంధాల అధికారి ప్రవీణ్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# కుప్పంలో టీడీపీకి పూర్వ నేతల తిరిగి రాక!

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో పార్టీలో చేరిన
మాజీ ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, మాజీ వైస్ చైర్మన్ మునుస్వామి, అడ్వకేట్ శ్రీకాంత్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 15:** కుప్పం పట్టణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. గతంలో ప్రజాప్రతి నిధులుగా పనిచేసిన పలువురు నాయకులు తిరిగి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ, చిత్తూరు జిల్లా ఎన్నికల పరిశీలకుడు కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విద్యాసాగర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మునుస్వామి, అడ్వకేట్ శ్రీకాంత్ గురువారం టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పి.ఎస్. మునిరత్నం, పీకేఎం-ఉడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్. సురేష్ బాబు పార్టీలో చేరిన నాయకులకు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి తమ అనుభవాన్ని ఉపయోగించి పనిచేయాలని సూచించారు. చంద్రబాబు పాలనతో ఆకర్షితులై పార్టీలోకి.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పలువురు తిరిగి టీడీపీలో చేరడం సంతోషకరమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కుప్పం నియోజకవర్గంలో పార్టీకి ప్రజల మద్దతును మరింత పెంచేందుకు నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా నేతలు అభిప్రాయపడ్డారు. మాజీ ప్రజాప్రతినిధుల చేరిక స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# శ్రీ మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన లేపాక్షి దుర్గమ్మ

కృష్ణా జలాలతో జలాభిషేకం.. 200 మంది మహిళలకు పసుపు కుంకుమల పంపిణీ

**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,అక్టోబర్ 15:**



దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లేపాక్షి దుర్గమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. మాజీ ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ ఆధ్వ ర్యంలో కృష్ణా జలాలతో అమ్మవారికి జలాభిషేకం, గిరి ఆవుల పాలతో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం దుర్గాదేవి, వీరభద్రస్వామి, పాపినేశ్వర స్వామి, రఘునాథస్వాములకు ప్రత్యేక పూల అలంకరణలు చేసి పూజలునిర్వహించారు. శ్రీమహాలక్ష్మి అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. పూజల అనంతరం సుమారు 200 మంది మహిళా భక్తులకు పసుపు కుంకుమలు పంపిణీ చేశారు. ఆలయంలో సేవలందించే సిబ్బందికి వస్త్రాలు అందజేసి, వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నరసింహమూ ర్తి, పురావస్తు శాఖ అధికారి రాము, అర్చకులు శ్రీనివాస్, లక్ష్మీనరసింహ శర్మ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గూటికి మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి నౌషద్!

మాజీ మంత్రుల సమక్షంలో పార్టీ కండువా.. మున్సిపల్ చైర్మన్ పీఠంపై కన్ను



**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 15:** హిందూపురం రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి నౌషద్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం పుట్టపర్తిలో నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాజీ మంత్రులు, సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, తులసి రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. గత పదేళ్లుగా ప్రజాసేవలో కొనసాగుతున్న నౌషద్, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి తరఫున హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రాష్ట్ర అభివృద్ధి అంశాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్‌లో చేరినట్లు ఆయన తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున చైర్మన్ పదవికి పోటీ చేసి విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు చైర్మన్ పదవిపై హామీ ఇచ్చినట్లు కూడా పేర్కొన్నారు. ఈ చేరికతో హిందూపురం మున్సిపల్ రాజకీయాల్లో నౌషద్ పాత్రపై ఆసక్తి నెలకొంది. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి రాం భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, స్థానిక నాయకులు శ్యామ్ కిరణ్, జమీల్, అమానుల్లా, సాహిద్, కలీమ్, హనుమంతరాయుడు, సమాజ్ పార్టీ నాయకుడు సౌకత్ తదితరులు పాల్గొని నౌషద్‌కు మద్దతు తెలిపారు.

హిందూపురంలో ఎన్నికల నిర్వహణపై

# రాజకీయ పార్టీలతో అధికారుల సమావేశం

నామినేషన్ల స్వీకరణకు రెండు కేంద్రాలు..
అక్టోబర్ 16 నుంచి 18 వరకు దాఖలుకు అవకాశం



**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 15:** హిందూపురం మున్సిపల్ ఎన్నికల నిర్వహణ, నామినేషన్ల స్వీకరణపై మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున, డీఎస్పీ రవిబాబు రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ల ప్రక్రియ, ఉపసంహరణ, ప్రచారానికి సంబంధించిన నిబంధనలను వివరించారు. మున్సిపాలిటీలోని 52 వార్డులకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు రెండు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఒకటి నుంచి 20వ వార్డు వరకు పోటీ చేసే అభ్యర్థులు ఎంజీఎం మున్సిపల్ పాఠశాలలో, 21నుంచి 52వ వార్డు వరకు పోటీ చేసే అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాలని సూచించారు. అక్టోబర్ 16,17,18 తేదీల్లో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని,అక్టోబర్ 20 న ఉపసంహరణకు అవకాశం ఉంటుందని,21న తుది అభ్యర్థుల జాబితా విడుదల చేస్తామని వివరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవిబాబు మాట్లాడుతూ... ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో అమలులో ఉండే 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించడం, గుంపులుగా చేరడం, సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. గత ఎన్నికల కేసుల్లో ఉన్నవారు, సమస్యాత్మక వ్యక్తులపై బైండోవర్ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానాలు, ఇతర చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు,అభ్యర్థులు అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, మున్సిపల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ.. రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

డీఎస్పీ యతేంద్ర పర్యవేక్షణలో భద్రతా చర్యలు..
ఎస్ఐ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో పరిశీలన



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్15:** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ రేణిగుంట రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ యతేంద్ర పర్యవేక్షణలో,ఎస్ఐ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో స్టేషన్ పరిసరాలు, ప్రయాణికుల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు తిరుమలకు తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై నిఘా ఉంచాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రైల్వే స్టేషన్‌లో భద్రతా చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు.

# దసరా వేళ ఆధ్యాత్మిక జ్ఞాన ప్రచారం..

ఇంటింటికీ త్రైత సిద్ధాంత భగవద్గీత

**నగరి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 15:**



దసరా పండుగను పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం -ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం నగరి మండలంలోని సత్రవాడ, అడవికొత్తూరు, గుండ్రాజు కుప్పం, గొల్లకండ్రిగ, ముదిపల్లె గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రచార వాహనం ద్వారా ఇంటింటికీ చేరవేశారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన గ్రంథాల విశిష్టతను వివరిస్తూ, జీవాత్మ, ఆత్మ, పరమాత్మకు సంబంధించిన జ్ఞానం భగవద్గీతలో ప్రధానమని నిర్వాహకులు తెలిపారు. పది ఇంద్రియాలను యోగమార్గంలో జయించడమే దసరా పండుగ అంతరార్థమని వివరించారు. ఈ కార్యక్రమంలో దుత్తలూరు, కుప్పం, బంగారు పాళ్యం కమిటీలకు చెందిన జి. ప్రసాద్, కృష్ణ, హర్ష, సుధాకర్, మహేంద్ర, సుబ్బమ్మ, నాగమ్మ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APETL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# మున్సిపల్ పోరుకు వైసీపీ అభ్యర్థులు ఖరారు..



ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల సమరానికి వైసీపీ పూర్తిస్థాయిలో సిద్ధమైంది. పార్టీ అధ్యక్షుడు జగన్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులను, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఛైర్మన్ అభ్యర్థులను ఖరారు చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం అధికారికంగా పత్రికా ప్రకటన ద్వారా అభ్యర్థుల పూర్తి జాబితాను విడుదల చేసింది. మొత్తం 27 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, సామాజిక సమీకరణాలు, మహిళా ప్రాతినిధ్యానికి పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోంది.

**7 కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులు వీరే:**

వైసీపీ ప్రకటించిన జాబితా ప్రకారం, ఏడు కీలక నగర పాలక సంస్థలకు మేయర్ అభ్యర్థులను ఖరారు చేశారు.

విజయనగరం (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): కోలగట్ల శ్రావణి (వైశ్య)

విశాఖపట్నం (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): వరుదు కల్యాణి (కాపు వెలమ)

ఏలూరు (బీసీ): గంటా మోహన్ రావు (తూర్పు కాపు)

మచిలీపట్నం (బీసీ – మహిళ): లంకా జ్యోతి (తూర్పు కాపు)

ఒంగోలు (అన్‌రిజర్వ్‌డ్): కుప్పం ప్రసాద్ (వైశ్య)

నెల్లూరు (అన్‌రిజర్వ్‌డ్): ఆనం విజయ్ కుమార్ రెడ్డి (రెడ్డి)

కడప (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): బండి దీప్తిరెడ్డి (రెడ్డి)

మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్మన్ అభ్యర్థులు:

రాష్ట్రవ్యాప్తంగా 14 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు ఛైర్మన్ అభ్యర్థులను పార్టీ అధిష్ఠానం ప్రకటించింది.

**మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థుల జాబితా:**

ఇచ్ఛాపురం (బీసీ – మహిళ): పిలక రాజ్యలక్ష్మి (రెడ్డిక)

పలాస–కాశీబుగ్గ (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): తలసు శ్రీ పద్మ (కళింగ వైశ్య)

నర్సీపట్నం (బీసీ – మహిళ): చింతకాయల అనిత (కాపు వెలమ)

యలమంచిలి (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): బొద్దపు తులసి (కాపు)

తుని (బీసీ – మహిళ): పిట్ల రామ తులసి (శెట్టిబలిజ)

కొవ్వూరు (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): మన్నె పద్మ (కమ్మ)

రామచంద్రాపురం (బీసీ): చింతపల్లి నాగేశ్వరరావు (శెట్టిబలిజ)

కొండపల్లి (ఎస్సీ – మహిళ): నల్లమోతు తేజస్విని (మాదిగ)

తెనాలి (అన్‌రిజర్వ్‌డ్): మద్దాలి శేషాచలం (వైశ్య)

చీరాల (ఎస్సీ – మహిళ): డాక్టర్ ఇస్త్రార్ల షెర్లీ (మాల)

బద్వేల్ (అన్‌రిజర్వ్‌డ్): రాచపూడి వెంకట సాయి కృష్ణ (వైశ్య)

ప్రొద్దుటూరు (అన్‌రిజర్వ్‌డ్): పొర్రెడ్డి నరసింహారెడ్డి (రెడ్డి)

పులివెందుల (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): వైయస్ ప్రమీలమ్మ (రెడ్డి)

మదనపల్లె (బీసీ): జింకా చలపతి (బోయ)

**నగర పంచాయతీ ఛైర్మన్ అభ్యర్థులు:**

యలేశ్వరం (ఎస్సీ – మహిళ): బదిరెడ్డి ఆశాలత (మాదిగ)

వుయ్యూరు (ఎస్సీ): పైడముక్కల దివ్య (మాదిగ)

గురజాల (అన్‌రిజర్వ్‌డ్): పోలు వీరారెడ్డి (రెడ్డి)

కనిగిరి (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): పులి శాంతి రెడ్డి (రెడ్డి)

బుచ్చిరెడ్డిపాలెం (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): షేక్ షకీలా బేగం (ముస్లిం)

కమలాపురం (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): మార్జుల కవిత (రెడ్డి)

పార్టీ విడుదల చేసిన ఈ జాబితాలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించారు. మొత్తం 27 స్థానాల్లో 14 స్థానాలు మహిళలకే కేటాయించడం విశేషం. అదేవిధంగా, బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు కూడా గణనీయమైన సంఖ్యలో అవకాశాలు ఇచ్చారు. ఈ ప్రకటనతో ఆయా నగరాలు, పట్టణాల్లో ఎన్నికల సందడి అధికారికంగా మొదలైంది. పార్టీ ప్రకటించిన అభ్యర్థులు త్వరలోనే నామినేషన్లు దాఖలు చేసి, ప్రచార బరిలోకి దిగనున్నారు.

# హాట్‌కేకుల్లా విశాఖ ఉక్కు ప్లాట్ల అమ్మకం



**విశాఖపట్నం :** ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి ఆస్తుల విక్రయ ప్రక్రియ ఊరటనిస్తోంది. నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విశాఖ నగరంలోని ప్రముఖ ప్రాంతాలలో ఉన్న ప్లాట్ల ఈ–వేలానికి రియల్ రంగం నుంచి ఊహించని స్థాయి స్పందన లభించింది. ముఖ్యంగా నగరంలోని వ్యూహాత్మక ప్రాంతమైన హెచ్‌బీ కాలనీలో స్టీల్ ప్లాంట్‌కు చెందిన నిరుపయోగ భూముల విక్రయం కోసం నిర్వహించిన తొలి విడత ఆన్‌లైన్ వేలం ప్రక్రియ అత్యంత విజయవంతంగా ముగిసింది.తొలి విడతలో భాగంగా ఉంచిన ప్లాట్లను సొంతం చేసుకునేందుకు కొనుగోలుదారులు పోటీపడ్డారు. అధికారిక సమాచారం ప్రకారం, మొత్తం 150 ప్లాట్లను విజయవంతంగా విక్రయించగా, దీని ద్వారా ఏకంగా రూ. 366 కోట్లకు పైగా భారీ ఆదాయం సమకూరింది. మేనేజ్‌మెంట్ అంచనా వేసిన అంచనా ఆదాయం కంటే ఈ మొత్తం గణనీయంగా ఎక్కువగా ఉంది . విశాఖ నగరంలో రియల్ ఎస్టేట్ డిమాండ్ ఏ స్థాయిలో ఉందో ఈ వేలం ఫలితాలు మరోసారి రుజువు చేశాయి.ఈ వేలంలో అత్యధికంగా కొన్ని ప్రముఖ ప్రాంతాల్లో గజం ధర ఏకంగా రూ. 1.80 లక్షలకు పైగా పలకింది. జాతీయ రహదారికి సమీపంలో, రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉన్న ప్రదేశాల్లో ఈ ప్లాట్లు ఉండటంతో వ్యాపార వర్గాలు, పెట్టుబడిదారులు వీటిని దక్కించుకునేందుకు ఎగబడ్డారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆర్‌ఐఎన్‌ఎల్ భూములకు ఈ స్థాయిలో ఆదరణ లభించడం ప్లాంట్ ఆర్థిక పునరుజ్జీవనానికి పెద్దపీట వేస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.నిరర్థక ఆస్తులను నగదుగా మార్చుకునే వ్యూహంలో భాగంగా చేపట్టిన ఈ ఈ–వేలం ద్వారా ప్లాంట్‌కు తక్షణ ఆర్థిక వనరులు సమకూరే అవకాశం ఏర్పడింది. తొలి విడత విజయం ఇచ్చిన జోరుతో, మిగిలిన భూముల విక్రయానికి సంబంధించి తదుపరి దశ ప్రక్రియను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను సద్వినియోగం చేసుకుంటూ ఆర్జించిన ఈ ఆదాయం విశాఖ ఉక్కు మనుగడకు కొంతవరకు ఊతమిస్తుందనడంలో సందేహం లేదు.

# ట్వీట్లతో పోటీ లెక్క తేల్చేస్తున్న పెద్దలు




**విజయవాడ :** తమిళనాడు ముఖ్యమంత్రిగా తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన విజయ్ పర్యటన రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. అయితే విజయ్ పర్యటనలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్కడా కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. విజయ్ విజయవాడ టూర్ షెడ్యూల్ ఖరారైనప్పుడు .. ఆయన వ్యక్తిగతంగా పవన్‌తో భేటీ అవుతారని, లేదంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగే అధికారిక సమావేశంలో డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కల్యాణ్ పాల్గొంటారని జోరుగా ప్రచారం జరిగింది. తీరా చూస్తే, చంద్రబాబుతో జరిగిన జల చర్చల్లో గానీ, పున్నమి ఘాట్ వద్ద జరిగిన విజయవాడ ఉత్సవ్ 2.0 వేదికపై గానీ పవన్ అస్సలు కనిపించలేదు.పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చినప్పుడు.. అదీ సినిమా రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఒక స్టార్ లీడర్ ఏపీకి విచ్చేసిన వేళ, అదే సినీ నేపథ్యం, ప్రజాదరణ ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అధికారిక కార్యక్రమాల్లో భాగస్వామి అయి ఉంటే హుందాగా ఉండేదన్న అభిప్రాయం సాధారణ ప్రజల్లో, అభిమానుల్లో వ్యక్తమైంది. పైగా విజయవాడ నడిబొడ్డున జరిగే సాంస్కృతిక వేడుకలకు ఉప ముఖ్యమంత్రి హాజరు కాకపోవడం వెనుక ఏదైనా ప్రోటోకాల్ సమస్య ఉందా లేక రాజకీయ కారణాలు ఉన్నాయా అన్న ప్రశ్నలు సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి. ఏపీ సర్కార్ తరఫున మున్సిపల్ మంత్రి నారాయణ, ఇతర అధికారులు ముందుండి కార్యక్రమాలను నడిపించారే తప్ప, పవన్ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు.పవన్ కల్యాణ్ ఈ పర్యటనకు కావాలనే దూరంగా ఉండటం వెనుక ఒక బలమైన రాజకీయ, ఆత్మగౌరవ కోణం దాగి ఉందని జనసేన వర్గాలు చెబుతున్నాయి. విజయ్ గెలుపును నే సోషల్ మీడియా ట్రోలర్లు పవన్ కల్యాణ్‌ను విజయ్‌తో పోల్చుతూ తీవ్రస్థాయిలో కించపరిచే ప్రయత్నం చేశారు. విజయ్ ఏకంగా సొంతంగా అధికారంలోకి వచ్చారని, పవన్ మాత్రం ఇతర పార్టీల పంచన చేరి డిప్యూటీ సీఎం పదవితో సరిపెట్టుకున్నారంటూ నీచమైన పోలికలతో ట్రోలింగ్ వార్ నడిపారు. ఇప్పుడు ఒకవేళ విజయ్‌ను కలవడానికి వెళ్లినా, లేదా పక్కన నిలబడినా.. డిజిటల్ మాధ్యమాల్లో మళ్లీ పనిగట్టుకుని లేనిపోని పోలికలు తెచ్చి వ్యక్తిత్వ హననానికి దిగుతారన్న ముందస్తు అంచనాతోనే పవన్ వ్యూహాత్మకంగా తప్పుకున్నట్లు తెలుస్తోంది.తన ప్రమేయం వల్ల మీడియా ఫోకస్ అసలు చర్చలైన తెలుగుగంగ, గోదావరి?కావేరి జలాల నుంచి పక్కదారి పట్టి.. అనవసరమైన స్టార్ వార్స్ , పొలిటికల్ ట్రోలింగ్‌గా మారకూడదన్న ఉద్దేశంతోనే పవన్ కల్యాణ్ పూర్తి పరిపక్వతతో వ్యవహరించారని భావిస్తున్నారు. ప్రత్యర్థులకు ఎలాంటి రాజకీయ ఆయుధాన్ని చేతికి ఇవ్వకూడదన్న వ్యూహంతోనే ఈ టూర్‌కు పూర్తిగా దూరంగా ఉంటూ, ప్రభుత్వం తరఫున చంద్రబాబు?విజయ్ భేటీ సజావుగా సాగేలా చేశారని అంటున్నారు. ఇద్దరు సౌత్ ఇండియన్ సూపర్ స్టార్లు రాజకీయ వేదికపై ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తారని ఆశపడిన అభిమానులకు నిరాశే మిగిలినప్పటికీ, పవన్ తీసుకున్న ఈ దూరపు నిర్ణయం విమర్శకుల నోళ్లు మూయించేలా వ్యూహాత్మక అడుగుగానే నిలిచిందని అనుకోవచ్చు.

## కూటమి పార్టీల సీట్ల సర్దుబాటు ఖరారు

-మొదటిపేజీ తరువాయి

ప్రకారం కూటమి భాగస్వామ్య పక్షాలకు కేటాయించిన స్థానాల వివరాలు ఇలా ఉన్నాయి.

**కార్పొరేషన్ల వారీగా పంపకాలు**

రాష్ట్రంలోని కీలకమైన మున్సిపల్ కార్పొరేషన్ల పంపకాల్లో తెలుగుదేశం పార్టీ పైచేయి సాధించింది. మొత్తం కార్పొరేషన్లలో టీడీపీ 11 స్థానాల్లో, జనసేన 4 స్థానాల్లో, బీజేపీ 2 స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దించనున్నాయి.

తెలుగుదేశం పార్టీ (11): విజయనగరం, గ్రేటర్ విశాఖపట్నం, మచిలీపట్నం, మంగళగిరి–తాడేపల్లి, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కడప, కర్నూలు, తిరుపతి, చిత్తూరు.

జనసేన పార్టీ (04): శ్రీకాకుళం, కాకినాడ, ఏలూరు, విజయవాడ.

భారతీయ జనతా పార్టీ (02): రాజమండ్రి, అనంతపురం.

మున్సిపాలిటీల కేటాయింపు ఇలా : ఉమ్మడి జిల్లాల వారీగా, స్థానిక ప్రాధాన్యతలను బట్టి మున్సిపాలిటీలను కేటాయించారు.

జనసేన పోటీ చేసే మున్సిపాలిటీలు (21) : ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాయలసీమలోని కొన్ని కీలక పురపాలక సంఘాలను జనసేన కైవసం చేసుకుంది.

ఉత్తరాంధ్ర : పాలకొండ, రాజాం, సాలూరు.

ఉమ్మడి తూర్పు గోదావరి : తుని, గొల్లప్రోలు, పిఠాపురం, సామర్లకోట, అమలాపురం, ముమ్మిడివరం.

ఉమ్మడి పశ్చిమ గోదావరి : నిడదవోలు, నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం.

కృష్ణా, గుంటూరు జిల్లాలు : తిరువూరు, పెడన, తెనాలి, చిలకలూరిపేట.

ప్రకాశం, రాయలసీమ : దర్శి, మడకశిర, పుట్టపర్తి, పుత్తూరు.

బీజేపీ పోటీ చేసే మున్సిపాలిటీలు (07) :పలు జిల్లాల్లో పట్టున్న స్థానాలను కమలం పార్టీ దక్కించుకుంది.

కోస్తాంధ్ర : నెల్లిమర్ల, యలమంచిలి, బాపట్ల, కావలి, గూడూరు (నెల్లూరు జిల్లా).

రాయలసీమ, ప్రకాశం : కూటమి గిద్దలూరు, ఎర్రగుంట్ల, గూడూరు (కర్నూలు).

సమన్వయంతో ముందుకు : సీట్ల సర్దుబాటు ముగియడంతో కూటమి శ్రేణులు క్షేత్రస్థాయిలో ఉమ్మడి ప్రచారానికి సిద్ధమవుతున్నాయి. ఎక్కడా అసమ్మతికి తావులేకుండా, అంతర్గత విభేదాలను పక్కనబెట్టి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కూటమి విజయకేతనం ఎగరేయడమే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నారు.

## ప్రతి గ్రామాన్ని ఉపాధి కేంద్రంగా మార్చడమే ధ్యేయం

-మొదటిపేజీ తరువాయి



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

**గ్రామాలే ఉపాధి కేంద్రాలుగా..**

రాష్ట్రంలో 1.10 కోట్ల మంది సభ్యులతో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా) ఉన్నాయని, ఇవి ఏటా రూ.69 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయని చంద్రబాబు వివరించారు. నిన్నటి పొదుపు సంఘాలు నేడు వ్యాపార సంస్థలుగా రూపాంతరం చెందుతున్నాయని, భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ మేళాలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని, ఇది కేవలం ప్రదర్శన కాదని, గ్రామీణ ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెటింగ్ అవకాశాలు కల్పించే దిశగా తొలి అడుగని పేర్కొన్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ, కొత్త వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని మహిళలకు సూచించారు.

**సాంకేతికతతో ప్రపంచ మార్కెట్‌కు..**

'స్వయం ఏపీ' బ్రాండ్ ఉత్పత్తులను ఈ–కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేస్తామని చంద్రబాబు తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు. మహిళల భద్రత, ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూనే, వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఒక ఉపాధి కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌కు బిగ్‌షాక్




వైఎస్సార్సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసులో ఈడీ పిటిషన్లపై సీబీఐ కోర్టు రోజువారీ విచారణ ప్రారంభించింది. అరబిందో, హెటిరో సంస్థల కేసులో జగన్ దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌పై సీబీఐ కోర్టు ప్రధాన న్యాయమూర్తి పట్టాభి రామారావు విచారణ చేపట్టారు. ప్రధాన నిందితుడు జగన్ దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌పై ఆయన తరఫు న్యాయవాది అశోక్ రెడ్డి వాదనలు వినిపించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు వర్తించదని, క్రిమినల్ కేసు తేలకుండా ఈడీ కేసు నమోదు చేయడం చెల్లదని ఆయన వాదించారు.

జగన్ అక్రమాస్తులకు సంబంధించి 2006 నుంచి 2021 వరకు ఈడీ తొమ్మిది ఛార్జిషీట్లు దాఖలు చేసింది. ఈ ఛార్జిషీట్ల అన్నింటిలోనూ జగన్ ఏ1 నిందితుడిగా ఉన్నారు. జగన్ కేసుల్లో అటు సీబీఐ దాఖలు చేసిన 11 ఛార్జిషీట్లపై మాత్రమే ఇప్పటి వరకు రోజువారీ విచారణ చేపడుతోంది. ఈ విచారణ పూర్తయిన తర్వాతే ఈడీ కేసుల విచారణ ప్రారంభమవుతుందన్న ఉద్దేశంతో ఈడీ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేసింది. సీబీఐ కోర్టులో తాము నమోదు చేసిన 9 కేసుల విచారణలో కదలిక లేదని ఆ పిటిషన్‌లో పేర్కొంది. దీంతో ఇకపై ఈడీ కేసుల్లోనూ రోజువారీ విచారణకు సీబీఐ కోర్టు అంగీకరించింది. సీబీఐ, ఈడీ కేసులపై కోర్టుకు లభించే సమయాన్ని బట్టి రెండింటిపై విచారణ చేపడుతున్నారు.

**వాస్తవ ధర కంటే అధికంగా పెట్టుబడులు**

వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా హెటిరో, అరబిందోలకు తెలంగాణలోని జడ్చర్లలో చెరో 75 ఎకరాల భూకేటాయింపులకు ప్రతిఫలంగా అరబిందో, ట్రైడెంట్ రూ.10 కోట్లు, హెటిరో రూ.19 కోట్ల 50 లక్షలు ఆయన కుమారుడు జగన్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాయని ఈడీ కేసు నమోదు చేసింది. ప్రభుత్వం నుంచి లబ్ధి పొందినందుకు ప్రతిఫలంగా లబ్ధిదారులు జగన్‌కు చెందిన జగతి పబ్లికేషన్స్, భారతి సిమెంట్స్ తదితర కంపెనీల్లో షేర్ వాస్తవ ధర కంటే అధిక ప్రీమియంతో పెట్టుబడులు పెట్టారని ఈడీ వాదిస్తోంది.

సీబీఐ ఛార్జిషీట్ ఆధారంగా పీఎంఎల్ఏ కేసు నమోదు చేసిన ఈడీ ఈ ఒక్క కేసులోనే రూ.51 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. హెటిరో డ్రగ్స్‌కు చెందిన 35 ఎకరాల భూమి, రూ.3 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, అరబిందో ఫార్మాకు చెందిన 96 ఎకరాల భూమి, రూ.3 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, జననీ ఇన్‌ఫ్రాకు చెందిన 13 ఎకరాలకు పైగా భూమి, జగతి పబ్లికేషన్స్‌కు చెందిన రూ.14.5 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఈడీ జప్తులో ఉన్నాయి.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APETL/2024/86143


# కుప్పంలో వైసీపీకి మరో షాక్..

## టీడీపీలోకి 15 కుటుంబాలు
## 22వ వార్డులో కాణిపాకం వెంకటేష్ ఆధ్వర్యంలో చేరికలు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్15:**
కుప్పం మున్సిపాలిటీలో రాజకీయ చేరికలు ఆసక్తికరంగా మారుతున్నాయి. పట్టణంలోని 22వ వార్డుకు చెందిన 15 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. 22వ వార్డు మాజీ కౌన్సిలర్ రంగయ్యకు సంబంధించిన ఈ కుటుంబాలకు ఎమ్మెల్సీ, చిత్తూరు జిల్లా ఎన్నికల పరిశీలకుడు కంచర్ల శ్రీకాంత్, పీకేఎం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్. సురేష్ బాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కుప్పం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చేరికలు చోటుచేసుకున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు కుటుంబాల సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.., కుప్పం అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. 22వ వార్డులో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. స్థానికంగా మున్సిపల్ ఎన్నికల సందడి మొదలైన నేపథ్యంలో 15 కుటుంబాల చేరిక రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

## జిల్లా జడ్పీ చైర్పర్సన్ రేసులో
# రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కార్జాల అరుణ




**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 15:**
గత వైసీపీ ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ పలు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ,తనదైన శైలిలో ప్రజల్లోకి వెళుతున్నారు. యువగళం పాదయాత్ర సమయంలో మాజీ మంత్రి రోజా గౌరవ లోకేష్‌ని తప్పుగా మాట్లాడిందని ఆమె నివాసానికి చీర, గాజులు తీసుకెళ్తుంటే, ఆమె మహిళా అని కూడా చూడకుండా ఆమెపై అక్రమ కేసు నమోదు చేసి అర్ధ రాత్రి జైలుకు పంపించి అవమానపరిచారు. దింతో లోకేష్, చంద్రబాబు ఆమెకు పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర కార్యదర్శిగా పదవి కట్టబెట్టారు. ఇప్పుడు చిత్తూరు జిల్లా జడ్పీ చైర్పర్సన్‌గా అవకాశం రావడంతో పెనుమూరు నుంచి జడ్పీటీసీగా భరిలో ఉండాలని భావిస్తున్నారు. ఆమెకు మండలంలోని యువత, మహిళలు, పార్టీ నాయకులు అండగా ఉన్నామని హామీకూడా ఇచ్చారని సమాచారం ఉంది.

## గాయత్రీ దేవి అలంకారంలో
# ఆరిమాని గంగమ్మ తల్లి

### తయ్యూరులో వైభవంగా దసరా ఉత్సవాలు.. భక్తులకు అన్నదానం

**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 15:**



ఎస్ఆర్‌పురం మండలం తయ్యూరు పాయకట్టులోని ఇలవేల్పు శ్రీ ఆరిమాని గంగమ్మ తల్లి దసరా ఉత్సవాలు ఐదో రోజు గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకట చలపతి ఆచార్యులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి గాయత్రీ దేవిగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా యాగశాలలో మహాగణపతి హోమం, గాయత్రీ దేవి హోమం, షోడశోపచార పూజలు నిర్వహించి మంగళహారతి సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. రాత్రి అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జలంధర్ నాయుడు, వైస్ చైర్మన్ వెంకటరామయ్య, ఈవో వెంకట రాయల్, ప్రధాన అర్చకులు వెంకట చలపతి ఆచార్యులు, రాజేంద్రన్, కమిటీ సభ్యులు నీలమ్మ, గురవయ్య, అమృత చందు, జయలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు. అలాగే పాయకట్టు పెద్దలు పైనేని ధనుంజయ నాయుడు,సిద్ధయ్య శెట్టి, బాలాజీ నాయుడు,మునిరత్నం రెడ్డి, రామిరెడ్డి నాయుడు,గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ దర్శనం

### దుర్గా నగర్‌లో వైభవంగా నవరాత్రి పూజలు..భక్తులకు అన్నదానం

**వి.కోట,చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్15:**



వి.కోట మండల కేంద్రంలోని దుర్గా నగర్‌లో కొలువుదీరిన శ్రీదుర్గామాత అమ్మవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారిని దర్శించుకునేందుకు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రఘుపతి నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల సిబ్బంది వివరాలు వెంటనే సమర్పించాలి

### శాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్15:**
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఉద్యోగుల పూర్తి వివరాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా స్థాయి శాఖాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో నిర్వహిం చిన టెలికాన్ఫరెన్స్‌లో ఎన్నికల విధుల కేటాయింపుపై దిశానిర్దేశం చేశారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు క్షేత్రస్థాయి, మండల స్థాయి లో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను సేకరించి, జిల్లా ఎన్నికల కార్యాలయం అందించిన ఎక్సెల్ షీట్‌లో పూర్తి సమాచారం నమోదు చేసి పంపాలని కలెక్టర్ సూచించారు. కొన్ని శాఖల నుంచి వివరాలు పూర్తిస్థాయిలో అందలేదని పేర్కొంటూ, గురువారం సాయంత్రం 6.30 గంటల్లోగా పెండింగ్ వివరాలను సమర్పించాలని స్పష్టం చేశారు. ఉద్యోగుల వివరాల సేకరణ లో పారదర్శకత పాటించాలని, అర్హులైన సిబ్బంది వివరాలన్నీ నమోదు చేయాలని ఆదేశించారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, దివ్యాంగులు, క్యాన్సర్ బాధితులు, వైద్యపరమైన సమస్య లున్న ఉద్యోగుల మినహాయింపు అభ్యర్థనలను సంబంధిత నిబంధనలు, వైద్య ధ్రువపత్రాల ఆధారంగా పరిశీలించాలని తెలిపారు. ఈ నెల 16,17,18 తేదీల్లో ఎన్నికల విధులపై సిబ్బం దికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. చిత్తూరు, కుప్పం, పలమ నేరు ప్రాంతాల్లో శిక్షణకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఉద్యోగుల వివరాల పరిశీలన అనంతరం ఎన్నికల విధుల కేటాయింపునకు ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. గడువులోగా వివరాలు సమర్పించని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టెలికాన్ఫ రెన్స్‌లో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వర్మ కుటుంబానికి టీడీపీ నేత కిషన్ చంద్ ఆర్థిక సాయం



**వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 15:**
గంగాధర నెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలం గొడుగుచింత గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నక్క వర్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు గురుసాల కిషన్ చంద్ వర్మ కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బట్టే చాణిక్య ప్రతాప్, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్ నాయుడు, సీనియర్ నాయకులు ఆనంద్ రెడ్డి, తాతిరెడ్డి జైచంద్రారెడ్డి, రాజాజీ, హరిబాబు నాయుడు, ముని గురవయ్య పాల్గొన్నారు.

# కుప్పం కడ పీడీ వికాస్ మర్మత్ బదిలీ

### జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు



**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 15:**
చిత్తూరు జిల్లా కుప్పం ప్రాంతీయ అభివృద్ధి సంస్థ (కడ) ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఉత్తర్వు లు జారీ చేసినట్లు సమాచారం. వికాస్ మర్మత్‌ను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయా లని ఆదేశించినట్లు తెలిసింది. కడ ప్రాజెక్టు డైరెక్టర్ బాధ్యతలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు అదనంగా అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా పరిపాలనా మార్పుతో కుప్పం ప్రాంతీయ అభివృద్ధి సంస్థ కార్యకలాపాల బాధ్యతలను కలెక్టర్ పర్యవేక్షించనున్నారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- నగదు, మద్యం పంపిణీకి తావులేదు..
- నిబంధనలు పక్కాగా అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 15:**
జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమయంలో నిబంధనలను ఉల్లంఘిం చకుండా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు వ్యవహరించాలని గురువారం విడుదల చేసిన ప్రకటనలో సూచించారు. ప్రభుత్వ భవనాలు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాల్లో అనుమతి లేని రాజకీయ ఫ్లెక్సీలు, పోస్టర్లు, బ్యానర్లు, గోడ రాతలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఓటర్లకు నగదు, మద్యం, బహుమతులు పంపిణీ చేయడం, ఉచిత వస్తువులతో ప్రలోభపెట్టడం నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. కుల,మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదని, దేవాలయాలు, మసీదులు, చర్చిలను ఎన్నికల ప్రచారానికి వేదికలుగా ఉపయోగించకూడదని పేర్కొన్నారు. ప్రభుత్వ వాహనాలు, నిధులు, భవనాలను రాజకీయ ప్రయోజనాలకు వినియోగించరాదని, ఓటర్లను ప్రభావితం చేసేలా కొత్త పథకాల ప్రకటనలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, కొత్త నిధుల మంజూరుకు సంబంధించి అమల్లో ఉన్న ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మైకులు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి ముందస్తు అనుమతి తీసుకోవాలని, రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు వాటి వినియోగం నిషేధమని తెలిపారు. సరైన ఆధారాలు, పత్రాలు లేకుండా రూ.50 వేలకుపైగా నగదు తరలించరాదని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని కలెక్టర్ సూచించారు.

## మెరిసిన బ్యాంకింగ్, ఐటీ షేర్లు

### సెన్సెక్స్ 1,534, నిఫ్టీ 375 పాయింట్లు వృద్ధి

**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాల్లో ముగిశాయి. బ్యాంకులు, ఐటీ రంగ షేర్లతోపాటు బ్లూచిప్ కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లకు మదుపర్ల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలు మద్దతు లభించింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 1,533.72 పాయింట్లు లేదా 2.11 శాతం పుంజుకుని 74,315.61 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 1,548.40 పాయింట్లు ఎగబాకింది. ఇక నిఫ్టీ కూడా 374.65 పాయింట్లు లేదా 1.66 శాతం ఎగిసి 22,997.35 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పరుగులు పెడుతున్న ముడి చమురు ధరలకు బ్రేకులు పడటం.. మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ రేటు 2.34 శాతం పడిపోయి 103.60 డాలర్లకు దిగొచ్చింది. అలాగే ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ గతకొద్ది రోజులుగా పెరుగుతుండటం కూడా కలిసొచ్చింది. ఇక కృత్రిమ మేధస్సు విలువలు అతిగా పెరుగుతున్న నేపథ్యంలో సెంట్రల్ బ్యాంకులు, రెగ్యులేటర్లు, మార్కెట్ భాగస్వాములు దిద్దుబాటుకు అవకాశాలున్నాయని హెచ్చరించడం.. భారతీయ ఈక్విటీల్లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహానికి దోహదం చేసినట్టు తాజా సరళిని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతేగాక అమెరికాలో అధిక ద్రవ్యోల్బణం,

# సంపాదకీయం

## సిద్ధాంత పోరాటంలో
# నిశ్శబ్ద విప్లవం

తమిళనాడు రాజకీయ వేదికపై దశాబ్దాలుగా నడుస్తున్న సిద్ధాంత పోరాటంలో నిశ్శబ్ద విప్లవం కనిపిస్తోంది. ఒకప్పుడు ద్రవిడ ఆత్మగౌరవం, ప్రాంతీయ స్వయంప్రతిపత్తి , హిందీ వ్యతిరేక నినాదాలతో జాతీయ పార్టీలను, ముఖ్యంగా కాషాయ రాజకీయాలను నిరంతరం శత్రువుగా చిత్రీకరించడమే తమిళనాడులో గెలుపు మంత్రంగా ఉండేది. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఆయన తమిళనాడులో అడుగుపెట్టిన ప్రతిసారీ విపక్షాలు, తమిళ జాతీయవాద సంఘాలు గో బ్యాక్ మోదీ నినాదాలతో విరుచుకుపడేవి. నల్లజెండాలు, ఆకాశంలోకి ఎగిరే నల్ల బెలూన్లు ప్రధాని పర్యటనలకు నిరసన కాన్వాయ్‌లుగా మారిన రోజులను తమిళనాడు చూసింది. కానీ, ల చెన్నై మెట్రో ఫేజ్-2 ప్రారంభోత్సవంతో పాటు రూ. 13,000 కోట్ల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కోసం ప్రధాని మోదీ పర్యటించిన తీరును పరిశీలిస్తే, రాష్ట్రీయ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఈ సారి ప్రధాని పర్యటన వేళ గాలిలో నల్ల బెలూన్లు కానీ, రోడ్లపై భయానక నిరసనలు కానీ ఎక్కడా కనిపించలేదు. రాష్ట్రంలో రవాణా, విద్య, పరిశోధన, మౌలిక వసతుల రంగాలు వేగంగా పుంజుకునేలా రూ.13,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి ప్రధాని ఇక్కడికి వచ్చారు. ఇందులో ప్రధానంగా చెన్నై మెట్రో ఫేజ్-2 మార్గం ప్రారంభోత్సవంతో పాటు ఐఐటీ మద్రాస్ బ్రెయిన్ సెంటర్ సందర్శన లాంటి కీలక అధికారిక కార్యక్రమాలు ఉన్నాయి.ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీతో కలిసి అధికారిక కార్యక్రమంలో పాల్గొనడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అటు పరిపాలన పరంగా, ఇటు రాజకీయ వర్గాల్లో ఈ భేటీ సరికొత్త చర్చకు దారితీసింది. రాజకీయ వైరుధ్యాలు పక్కనబెట్టి, ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం ప్రధానితో ఒకే వేదికను పంచుకోవడమే కాకుండా, మెట్రో రైలులో పక్కపక్కనే కూర్చుని ప్రయాణించడం తమిళనాడు క్షేత్రస్థాయి రాజకీయాల్లో వచ్చిన గుణాత్మక మార్పునకు అద్దం పడుతోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా కేంద్ర పెద్దల పర్యటనను నిరసనలతో హోరెత్తించే సంస్కృతి స్థానంలో ఇప్పుడు సంయమనం, పరస్పర గౌరవం చోటుచేసుకున్నాయి.తమిళ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియా ట్రెండ్స్‌ను విశ్లేషిస్తే.. తమిళ ప్రజల ఆలోచనా విధానంలో కూడా గణనీయమైన మార్పు వచ్చినట్లు తెలుస్తోంది. ఉచితాలు , సెంటిమెంట్ రాజకీయాల కంటే అభివృద్ధి , మౌలిక వసతుల కే తమిళ యువత ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. చెన్నై మెట్రో విస్తరణ, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, పారిశ్రామిక హబ్‌లకు కేంద్ర నిధులు అత్యంత ఆవశ్యకమని భావిస్తున్న నేపథ్యంలో, అనవసరమైన రాజకీయ ద్వేషం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందనే అభిప్రాయం తమిళ నెటిజన్లలో వ్యక్తమవుతోంది. తమిళనాడు రాజకీయ రంగాన కొత్తగా ఆవిర్భవించిన పొలిటికల్ శక్తులు , మారిన ద్రవిడ కూటముల వ్యూహాలు కూడా ఈ మార్పునకు కారణమయ్యాయి. బీజేపీపై కేవలం రొటీన్ ఆరోపణలతో ఇకపై ఓటు బ్యాంకును నిలబెట్టుకోలేమని గ్రహించిన ప్రధాన ద్రవిడ పార్టీలు, వ్యూహాత్మకంగా తమ ఘర్షణ వైఖరిని తగ్గించుకున్నాయి. ప్రధాని మోదీ సైతం తన ప్రసంగాల్లో తిరుక్కురళ్ పద్యాలను, తమిళ సంస్కృతి, భారతీయార్ కవితలను నిరంతరం ప్రస్తావిస్తూ తమిళ భాషాభిమానాన్ని ఆకట్టుకునేందుకు చేస్తున్న నిరంతర ప్రయత్నాలు కాషాయంపై ఉన్న సైకలాజికల్ భయాన్ని గణనీయంగా తగ్గించాయి. ఈ మార్పు వెనుక ఉన్న మరో ముఖ్యమైన రాజకీయ కోణం.. జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలకు మారుతున్న అవసరాలు. ఒకప్పుడు బీజేపీని అంటరాని పార్టీగా చూసిన ద్రవిడ నేతలు ఇప్పుడు కేంద్రంతో సత్సంబంధాలు నెరపడం ద్వారానే రాష్ట్ర అభివృద్ధి నిధులు తెచ్చుకోగలమని భావిస్తున్నారు. అంతేకాకుండా, క్షేత్రస్థాయిలో బీజేపీ వేగంగా పుంజుకోవడం, ఓటు బ్యాంకును విస్తరించుకోవడంతో నేరుగా కాషాయ శ్రేణులతో విభేదించడం కంటే రాజకీయ పోటీని ప్రజాసమస్యలపైకి మళ్లించడమే ఉత్తమమని స్థానిక నాయకత్వాలు నిర్ణయించుకున్నాయి. ఒకప్పుడు తమిళనాడు రాజకీయాల్లో విజయానికి మార్గంగా ఉన్న కాషాయ వ్యతిరేకత , బీజేపీ ద్వేషం ఇప్పుడు క్రమంగా తన ప్రాధాన్యతను కోల్పోతోంది. నల్ల బెలూన్ల స్థానంలో అభివృద్ధి భాగస్వామ్యానికి ప్రాధాన్యమిచ్చే నయా రాజకీయ శకం తమిళ నేలలో ప్రారంభమైంది. రాబోయే ఎన్నికల్లో కేవలం భావోద్వేగాలు, ద్రవిడ సెంటిమెంట్లు మాత్రమే కాకుండా, సంక్షేమం , మౌలిక వసతుల రూపకల్పనే గెలుపోటములను నిర్ణయించే ప్రధాన అంశంగా మారబోతోంది.

Edited Printed Published & Owned by K.L Krishnam Raju. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 19/86-1, Jaya Prakash Road, Kuppam, Chittoor District, Andhra pradesh. EDITOR K.L.KRISHNAM RAJU, RNI. NO. APTEL/2023/86143